విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

కాకినాడ పార్లమెంటు నియోజకవర్గ నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర - కాకినాడ : సాధారణ ఎన్నికలు -2024లో భాగంగా కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జే.నివాస్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం నామినేషన్లు స్వీకరణ గురువారం నుంచి జరుగుతుందన్నారు. నామినేషన్ స్వీకరణ ప్రక్రియను మొత్తం వీడియో కవరేజ్ చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. నామినేషన్ దాఖలుకు సంబంధించిన అంశాలపై అవగాహన కలిగించేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నామినేషన్ దాఖలు చేసేందుకు నోటిఫైడ్ తేదీలలో ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, ప్రభుత్వ సెలవు దినాలలో నామినేషన్ స్వీకరణ ఉండదన్నారు. అభ్యర్థులు గరిష్టంగా 4 సెట్ల నామినేషన్ దాఖలు చేయవచ్చని, గరిష్టంగా రెండు నియోజకవర్గాల నుంచి మాత్రమే నామినేషన్లను ఫైల్ చేయవచ్చన్నారు. నామినేషన్లను ఆర్వోకు గానీ, సంబంధిత ఏఆర్‌ఓకు మాత్రమే అభ్యర్థి నేరుగా గానీ, తన ప్రపోజర్ ద్వారా గానీ సమర్పించవచ్చన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో 100 మీటర్ల పరిధిలో గరిష్టంగా 3 వాహనాల మాత్రమే అనుమతించబడతాయని, అభ్యర్థితో సహా ఐదుగురు వ్యక్తులు మాత్రమే ఆర్వో కార్యాలయంలోకి అనుమతించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. నామినేషన్లు వేయడానికి చివరి తేదీ 25 ఏప్రిల్ 2024 (గురువారం), పరిశీలన తేదీ: 26 ఏప్రిల్ 2024 (శుక్రవారం), ఉపసంహరణకు చివరి తేదీ 29 ఏప్రిల్ 2024 (సోమవారం) అని అదే రోజున పోటీలో ఉండే అభ్యర్థుల వివరాలు ప్రకటించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పోలింగ్ తేదీ 13 మే 2024 (సోమవారం) కౌంటింగ్ తేదీ 04 జూన్ 2024 (మంగళవారం) అని కలెక్టర్ జె. నివాస్ ఈ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శించిన వ్యయ పరిశీలకులు

విశాలాంధ్ర - కాకినాడ : సార్వత్రిక ఎన్నికలు-2024 నిర్వహణలో భాగంగా కాకినాడ జిల్లా ఎన్నికల పర్యవేక్షణ నిమిత్తం నియమితులైన కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశిలకులు సాద్దిక్ అహ్మద్ (ఐఆర్ఎస్), తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల వయ్య పరిశీలకులు యోగేష్ కుమార్ (ఐఆర్ఎస్)టీ పెద్దాపురం, కాకినాడ పట్టణం, జగ్గంపేట నియోజకవర్గాల వయ్య పరిశీలకులు ఏ.ఆషీఫ్ (ఐఆర్ఎస్) గురువారం కలెక్టరేట్ స్పందన హాల్లో ఏర్పాటుచేసిన సాధారణ ఎన్నికలు-2024 కమాండ్ కంట్రోల్ రూమ్‌ను..జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జెనివాస్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా కంట్రోల్ రూమ్‌లో ఉన్న 1950 కాల్ సెంటర్, హెల్ప్ డెస్క్ సువిధ, చెక్ పోస్టల వెబ్ కాస్టింగ్, వివిధ మీడియా న్యూస్ ఛానెల్స్ మానిటరింగ్, సీ విజిల్ యాప్, ఎఫ్ఎస్టీ బృందాల వంటి విభాగాల పనితీరును జిల్లా కలెక్టర్..వ్యయ పరిశీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పే నాయక్, కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి డి. భారతి, సమాచార శాఖ డీడీ డి.నాగార్జున, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి. బాబురావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి పథకాలు మళ్లీ గెలిపిస్తాయి

విశాలాంధ్ర - అనపర్తి : జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే మళ్లీ గెలిపిస్తాయని ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. గురువారం మహేంద్రవాడలో ఆదిలక్ష్మి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజక వర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సూర్యనారా యణ రెడ్డి ఎనలేని కృషి చేశారని ఆదిలక్ష్మి అన్నారు.అందరినీ ఆదిలక్ష్మి అందరినీ ఆప్యాయతగా పలకరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే,ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - అనపర్తి : రంగంపేట మండలం పెద రాయవరంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారా యణ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బుధవారం ఇంటింటికి వెళ్ళి సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భారీ స్థాయిలో అక్రమ మద్యం పట్టివేత

విశాలాంధ్ర - ఆలమూరు : మండల కేంద్రమైన ఆలమూరు నుంచి పెనికేరు వెళ్లే దారిలో ఎస్సీబీ స్టేషన్‌కు అతి సమీపంలో ఉన్న ఇటుక బట్టీ వద్ద భారీగా గోవా మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయని అధికారులు తెలిపారు. స్థానిక ఎస్సీబీ స్టేషన్‌కి వచ్చిన విశ్వసనీయ సమాచారాన్ని అడిషనల్ ఎస్పీ ఖాదర్బాషాకు తెలియజేయడంతో ఆయన ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు ఎస్సీబీ అధికారులను అలర్ట్ చేసినట్లు దాంతో వారంతా కలిసి దాడి నిర్వహించి మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో మొత్తం 130 బాక్సుల్లో ఉన్న 6240 బాటిళ్ళ మద్యం లభించినట్లు ఎస్సీబీ అధికారులు తెలిపారు. మద్యం గోవాకు చెందినదని మొత్తం విలువ రూపాయలు 7.8 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సిబిఎస్ఐ సత్యవేణి తెలియజేశారు.

వలంటీర్లు రాజీనామా

విశాలాంధ్ర - ముమ్మిడివరం : మండల పరిధిలోని గేదెల్లంక, కర్రి వాని రేవు సచివాలయం పరిధిలోని వాలంటీర్లు స్వచ్ఛందగా రాజీనామాలు చేశారు. రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని కరోనాకాలంలో ప్రాణాలు తెగించి తాము చేసిన సేవలను మరిచిపోయి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ విమర్శలు చేయడం ఏమాత్రం తగదని వారు తెలియజేశారు.

సోమవరంలో వైసీపీకి షాక్

విశాలాంధ్ర - జగ్గంపేట/కిర్లంపూడి : మండలంలోని సోమవరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. సోమవరం గ్రామ సర్పంచ్ జ్యోతుల సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ సూతి శ్రీనివాసరావుతో పాటు పలువురు వైసీపీకి రాజీనామా చేసి గురువారం టిడిపిలో చేరారు. వారికి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ నా రాజకీయ ప్రస్థానం దగ్గర నుంచి సోమవరం గ్రామం ఎప్పుడు అండగా ఉండేదని మొన్న జరిగిన ఎన్నికల్లో ఒకసారి అవకాశం ఇవ్వండి అంటూ అభ్యర్థించిన వారికి అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. మళ్లీ ఇప్పుడు నా నాయకత్వాన్ని బలపరుస్తూ పార్టీలోకి రావడం నాకు మరింత బలం చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జంపన సీతారామచంద్ర వర్మ, జట్ల సదా సాంబశివరావు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ప్రచార ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

కలెక్టర్ హిమాన్స్ శుక్లా

విశాలాంధ్ర - అమలాపురం : ప్రచార ప్రకటనలకు అనుమతి తప్పనిసరని నిబంధనలు అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసు కుంటామని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని మీడియా సర్టిఫికేషన్ సమన్వయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, సుమిత్ దాస్ గుప్తా, రాహుల్ దింగడా వ్యయ పరిశీలకులతో కలిసి సందర్శించి కేంద్ర నిర్వహణ తీరును ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రచార ప్రకటనల ప్రెస్ క్లిప్పింగ్స్ రికార్డులు ఆధారంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యయ పరిశీలకులకు కేంద్రం పనితీరును వివరిస్తూ వివిధ ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాల్లో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని మీడియాకు సూచించినట్టు తెలిపారు. దీని కోసం కలెక్టరేట్లో జిల్లా స్థాయి మీడియా సర్టిఫి కేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి మంజూరు చేయటంతో పాటు, చెల్లింపువార్తలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుం దన్నారు. మీడియా ఉల్లంఘనలను కూడా గుర్తించి తగిన చర్యలు తీసు కుంటున్నట్లు పేర్కొన్నారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలు లేదా వాటి తరపున ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు అనుమతి పొంద టం కోసం నిర్దిష్ట నమూనాలో ప్రకటన ప్రసారం చేసే మూడు రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించామన్నారు. గుర్తింపు పొందని రాజకీయ పార్టీలు, ఇతర వ్యక్తులు ప్రకటనలు ప్రసారం చేసేందుకు ఏడు రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించా మన్నారు. దరఖాస్తు అందిన రెండు రోజుల్లోపు జిల్లా స్థాయి ఎంసీఎంసీ కమిటీ అనుమతి మంజూరు చేస్తుందన్నారు.

కాకినాడ జిల్లాలో 7 శాసనసభ నియోజకవర్గాల్లో 4 నామినేషన్లు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లాలోని 7 శాసనసభ నియోజక వర్గాల్లో 4 నామినేషన్లు, కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ఒక నామినేషన్ దాఖలు అయినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జె నివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం నుండి అన్నవరం పితాని ఇండిపెండెంట్ అభ్యర్థి ఒక సెట్ నామినేషన్ వేసారని, కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి టేకు మూడీ శ్రీనివాసరావు, విను కొండ వెంకటేశ్వరరావు, మట్ట వెంకటేశ్వరరావులు ఇండిపెండెంట్ అభ్యర్థి ఒక్కొక్క సెట్ నామినేషన్ దాఖలు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ తెలిపారు. కాకినాడ పార్లమెంటరీ నియోజక వర్గం నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా భవాని శంకర్ ప్రసాద్ మెర్ల రెండు సెట్లు నామినేషన్లను దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఆ ప్రకటనలో వివరించారు.

టీడీపీకి జిల్లా అధికార ప్రతినిధి పైలా రాజీనామా

విశాలాంధ్ర - ఏలేశ్వరం : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు జిల్లా అధికార ప్రతినిధి పైల సుభాష్ చంద్రబోస్ టీడీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన ఏలేశ్వరంలో గురువారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బోస్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుండి తాను, తన కుటుంబం తెలుగుదేశం పార్టీలోనే కొనసాగామని, గత కొంతకాలంగా ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ ఏక పక్షంగా వ్యవహరిస్తూ, ఒంటెద్దు పోకడ విధానం నచ్చకే పార్టీ నుండి బయటకు వస్తున్నామని తెలిపారు. ఇటీవలే పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్వయంగా సత్యప్రభతో చెప్పినప్పటికీ ఆమెలో మార్పు రాలేదని అన్నారు. త్వరలో పార్టీ కార్యకర్తలతో, అభిమానులతో చర్చించి తన రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. సమావేశంలో ముచ్చి అప్పలరాజు, వాగు రమేష్, సతివాడ రాజేష్, కార్యకర్తలు ఉన్నారు.

విశ్వరూప్‌కు ఘనస్వాగతం

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : వైయస్ఆర్ పార్టీ ప్రచారం గురువారం ఉప్పలగుప్తంలో హెూరెత్తింది. అమలాపురం అసెంబ్లీ నుండి వైసీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తాజామాజీ మంత్రి పినిపే విశ్వరూప్ తనదైన శైలిలో ప్రచారంలో పాల్గొని ప్రజలను ఆకట్టుకున్నారు. మహిళలు అడుగడుగునా హారతులు ఇచ్చి ఆయనకు స్వాగతం పలికారు. రాష్ట్ర మంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన పథకాలు పేదల జీవితాలలో వెలుగులు నింపాయని తిరిగి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు మేమంతా సిద్ధమంటూ మహిళలు నినాదాలు చేసారు. కాపు నాయకుడు మోటూరి సత్యంకాపు ఇంటి వద్ద హారతులిచ్చి పూలమాలలతో సత్కరించి భారీర్యాలీతో స్వాగతం పలికారు. ఆదిలక్ష్మి పురంనుండి ప్రారంభించిన ప్రచారం భారీ ర్యాలీతో పేరాయిచెరువు మధుర పేట్ మీదుగా అన్ని పేటలలో కొనసాగింది. ఆయనతో పాటు జడ్పిటిసి గెద్దం సంపదరావు బద్రి బాబ్జి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నరాజు, వంటెద్దు వెంకన్నాయుడు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, చిక్కం త్రినాధ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన చికిత్సకు ప్రభుత్వాసుపత్రికి తరలింపు

విశాలాంధ్ర - గోపాలపురం : మండలంలోని వాదాలకుంటలో గ్యాస్ లీక్ అయి వంట గదిలో వ్యాపించిన సంఘటనలో తల్లి, కుమార్తె, మనవరాలు మంటల్లో చిక్కుకున్నారు. మంటల్లో చిక్కుకున్న వారిలో తల్లి నామాల నిర్మల, కుమార్తె కళ్యాణి కుమారుడు కార్తీక్ తీవ్ర గాయాలపాలు కాగా మంటల్లో గాయపడిన వారిని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తల్లినిర్మలను మెరుగైన వైద్యం కొరకు రాజ మహేంద్రవరం కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

అట్టహాసంగా తలారి నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-కొవ్వూరు : 2024 అసెంబ్లీ ఎన్నికల జాతర మొదలైంది. దీనిలో భాగంగా కొవ్వూరు వైకాపా అభ్యర్థి గోపాల పురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కార్య కర్తలు, నాయకులు, అభిమానులు భారీ ఎత్తున తరలిరాగా ఊరేగింపుగా బయలుదేరి కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆఫీస్ లో తన నామినేషన్ దాఖలు చేశారు. డమ్మీ అభ్యర్థిగా ఎమ్మెల్యే సతీమణి పరంజ్యోతి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరు శివరామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ భావనరత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం నియోజకవర్గంలో మూడు నామినేషన్ల దాఖలు

విశాలాంధ్ర - కాజులూరు : మే నెల 13వ తేదీన జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గం నెంబర్ 42 నుండి మూడు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్ సుధా సాగర్ తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుండి మూడు గంటల వరకు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారన్నారు. ఇందులో వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా పిల్లి సూర్య ప్రకాష్, రెండు సెట్లు వైయస్సార్సీపి అభ్యర్థిగా పిల్లి సుభాష్ చంద్రబోస్, ఒక సెట్ నామినేషన్ స్వతంత్ర అభ్యర్థిగా గుత్తుల జై సూర్యేంద్ర నాథ్ బాబూజీ, రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.

సంక్షేమం పేరుతో రాష్ట్రం దోపిడి

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

విశాలాంధ్ర-కొవ్వూరు : సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని సైకో జగన్ నిలువునా దోచు కున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ధ్వజమెత్తారు. గురువారం కొవ్వూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి అరిగెల అరుణకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియాకూటమి బలపరిచిన అభ్యర్థి అరుణ్ కుమారి విజయానికి కార్మికులు, కర్షకులు విద్యార్థులు ముందుకు వచ్చి ఆమెను గెలిపించాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా ఉండాలన్నా, ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ వర్గాల పై దాడులు ఆగాలన్నా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలన్నారు. 2014లో తిరుపతి వెంకన్న సాక్షిగా మోడీ, చంద్రబాబు నాయుడులు హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కొవ్వూరును మోడల్ నియోజకవర్గం తీర్చిదిద్దుతామని మధు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కొండ్రుపు రాంబాబు, రాజమండ్రి నగర కార్యదర్శి వి. కొండలరావు, కొప్పిశెట్టి శ్రీనివాస్, చింతలపూడి సుధీర్. కె. నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆదిరెడ్డి శ్రీనివాస్ నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : సిటీ నియోజకవర్గ టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. తిలక్ రోడ్డులోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, వారి నివాసంలో సర్వమత ప్రార్థనల అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య భారీ జన సందోహంతో తిలక్ రోడ్డు సాయిబాబా మందిరం దగ్గర నుంచి భారీ ర్యాలీగా శ్యామలానగర్, గోరక్షణపేట, జాంపేట, దేవీచౌక్ మీదుగా గోకవరం బస్టాండ్ సమీపంలోని నగర పాలక సంస్థ ఆవరణలో ఉన్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నగర తొలి మహిళ మేయర్ ఆదిరెడ్డి వీర రాఘవమ్మ, రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థిని దగ్గుబాటి పురంధేశ్వరి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఆర్యాపురం బ్యాంకు మాజీ చైర్మన్ చల్లా శంకరరావులతో ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆర్వో కార్యాలయానికి చేరుకుని పలు పత్రాలు పూర్తి చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి వారికి తన నామినేషన్ పత్రాలు అందచేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ కూడా నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వారికి సమర్పించారు.

తలారి నామినేషన్

విశాలాంధ్ర - తాళ్ళపూడి : కొవ్వూరు నియోజక వర్గ వైఎస్సార్సీపి తరుపున పోటీ చేసే ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు నామినేషన్ దాఖలు చేశారు. తొలుత నాయకులు, కార్యకర్తలు కొవ్వూరు తలారి కార్యాలయం వద్దకు తరలి వెళ్లారు. పెద్దేవం నుండి ఇటీవల పార్టీ లోకి వచ్చిన కల్లూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నాయకులు ఎంపీపీ పోసిరాజు, ఎస్సి సెల్ అధ్యక్షులు సిర్ర గంగరావు, సీనియర్ నాయకులు నరాలశెట్టి బొండియ్య, యాండపల్లి కృష్ణార్జునుడు,సాయన సుబ్బారావు తదితరులు బయలు దేరి వెళ్లారు. ప్రక్కిలంక నుండి ఎస్సి సెల్ నియోజకవర్గ నాయకులు యాళ్ల బాబురావు ఆధ్వర్యంలోను, గజ్జరం నుండి సర్పంచ్ రాంబాబు, నాయకులు వల్లభని శ్రీహరి, మలకపల్లి నుండి కుంటముక్కల కేశవ్,తిరుగుడు మెట్ట నుండి వల్లభసెట్టి శ్రీను, పెద్దేవం నుండి తోట రామకృష్ణ, సర్పంచి వెంకట్రావు ఆధ్వర్యాన వైకాప వర్గాలు బయలు దేరి వెళ్లాయి.

వైసీపీ అభ్యర్థిగా సూర్య ప్రకాష్ నామినేషన్

విశాలాంధ్ర - కాజులూరు : రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం వద్ద నుండి భారీ బైక్ ర్యాలీగా బయలుదేరి రామచంద్రపురం పట్టణం ఆర్డీవో ఆఫీస్ నందు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్" రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా కందులపాలెం వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని మరియు మామిడాడ గ్రామం సూర్యనారాయణ స్వామి వారి దేవాలయాన్ని..చివరగా ద్రాక్షారామం గ్రామం శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవాలయాలను దర్శించి..అక్కడ నుంచి భారీ ఎత్తున నియోజకవర్గ జన ప్రభంజనంతో వేలాదిమందితో బైక్ ర్యాలీ రామచంద్రపురం పట్టణం ఆర్డీవో ఆఫీస్ వరకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గౌరవ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, మండపేట నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు, నియోజకవర్గ అబ్జర్వర్ చింతలపాటి శ్రీనివాస రాజు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

రాజమండ్రి రూరల్‌లో దాఖలు కాని నామినేషన్లు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజక వర్గానికి తొలి రోజున నామినేషన్లు దాఖలు కాలేదని నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి/ జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ గురువారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. ఏప్రియల్ 25వ తేదీ వరకు ప్రతి రోజు (ఏప్రియల్ 21 ఆదివారం మినహా) ఉదయం 11 గంటల నుంచి మ.3 వరకు మాత్రమే నామినేషన్లు అనపర్తి మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో స్వీకరించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

63 బృందాలు విధుల నిర్వహణ

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : జిల్లా స్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్ర స్థాయిలో లిక్కర్ లావాదేవీలు, ఇతర ఫ్రీబీస్ పంపిణీల తీరుపై సూక్ష్మ స్థాయిలో నిఘా పెట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే. మాధవీలత తెలియ చేశారు. గురువారం కలక్టరేట్‌లోని డి ఈ వో ఛాంబర్ లో జిల్లా ఎఫ్ ఎస్ టి బృందంతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో 7 నియోజక వర్గాల స్థాయిలో 63 బృందాలు మూడూ షిఫ్ట్‌లలో విధులను నిర్వర్తిస్తున్నట్లు తెలియ చేశారు. వీటికి అదనంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో పదిమంది సభ్యులతో జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ బృందానికి సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి నోడల్ అధికారిగా నియమించామన్నారు. ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్టు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మరింత ఖచ్చితత్వంతో విధులను చేపట్టాల్సి ఉందన్నారు. ఇన్కమ్ ట్యాక్స్, జిఎస్‌టి., ఎస్ఎస్‌టి శాఖల ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించి ఆమేరకు చేపట్టవలసిన చర్యలపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సహాయ కలెక్టర్, డిఎఫ్ఎస్టి నోడల్ అధికారి సి. యశ్వంత్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం. భాను ప్రకాష్, ఎక్సైజ్ , ఎస్ ఎస్ టి, జి ఎస్ టి , ఇన్కమ్ ట్యాక్స్, తదితర శాఖల కోర్ టీమ్ అధికారులు హాజరయ్యారు.

రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గ నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర -తూర్పుగోదావరి : సార్వత్రిక ఎన్నికలు 2024కు సంబంధించిన 08 - రాజమండ్రి పార్లమెంటు నియోజక వర్గ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశామని, నోటీసు బోర్డులో ప్రదర్శించినట్లు కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె. మాధవీలత తెలియ చేశారు. గురువారం కలక్టరేట్ లోని పార్లమెంటు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ఛాంబర్ లో నోటిఫికేషన్ విడుదల చేసినట్టు తెలిబీపారు. ఈ సందర్భంగా కలెక్టర్, డి ఈ వో కె. మాధవీలత వివరాలు తెలియచేస్తూ, నామినేషన్లు దాఖలు విధానంలో ఎన్నికల కమిషన్ రూపొందించిన ప్రవర్తనా నియమావళిని పాటించనున్నట్టు చెప్పారు. మొత్తం ఈ ప్రక్రియను వీడియో రికార్డు చేసేందుకు నామినేషన్లను స్వీకరించే గదిలో, అభ్యర్డులు ప్రవేశించే ద్వారాల వద్ద సిసి కెమేరాలను ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్లు దాఖలు చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించడం కోసం ప్రత్యేక నామినేషన్ సెల్ (హెల్ప్ డెస్క్) ఏర్పాటు చేశామన్నారు.

జిల్లాకు రానున్న ఎన్నికల పరిశీలకులు

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : సార్వత్రిక ఎన్నికలు 2024కు సంబంధించిన 08 - రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గానికి, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులను కేంద్ర ఎలక్షన్ కమిషన్ నియమించినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె. మాధవీలత తెలియ చేశారు. గురువారం ఉదయం కలక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాకు వచ్చే ఎన్నికల పరిశీలకులకు అనుసంధానం చేసిన లైజాన్ అధికారులు, ఇతర అనుబంధ సిబ్బందితో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణ నాయక్ లతో కలసి కార్యాచరణ ప్రణాళికా పై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్, డిఈవో కె. మాధవీలత మాట్లాడుతూ జిల్లాకు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన కె.బాల సుబ్రమణ్యం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కమల్ కాంత్ సరోచ్, తమిళనాడు రాష్ట్రానికి చెందిన జై అరవింద్, పార్లమెంట్ వ్యయ పరిశీలకులుగాను, జిల్లాలోని ఏడు అసెంబ్లీ వియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా నితిన్ కురైన్, గుజరాత్ రాష్ట్రానికి చెందిన బలరామ్ మీనాను పోలీస్ అబ్జర్వర్ గా కేంద్ర ఎలక్షన్ కమిషన్ నియమించినట్లు తెలిపారు.

జిల్లాకు పార్లమెంటు నియోజకవర్గ వ్యయ పరిశీలకులు

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : రాజమండ్రి పార్లమెంటు నియోజక వర్గ ఖర్చుల పరిశీలకులు (ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్) జై అరవింద్ గోవింద్ రాజన్ జిల్లాకు వచ్చినట్టు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దా కే. మాధవీలత తెలియ చేశారు. గురువారం ఉదయం స్థానిక రిటర్నింగ్ అధికారి ఛాంబర్ లో జిల్లా ఎన్నికల అధికారి తో తమిళనాడు కి చెందిన అధికారి జై అరవింద్ గోవింద్ రాజన్ కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంటు నియోజక వర్గ, జిల్లా అసెంబ్లి నియోజక వర్గ పరిధిలో ఖర్చుల అంచనా వివరాలు, రికార్డులు నిర్వహణా తదితర అంశాలపై చర్చించారు.

మద్దిపాటి నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం ఎన్‌డిఏ ఉమ్మడి అభ్యర్థి, గోపాలపురం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు పూజలు నిర్వహించి నామినేషన్ వేసేందుకు గోపాలపురం బయలుదేరారు. ద్వారకాతిరుమల దూబచర్ల నల్లజర్ల అనంతపల్లి ఎర్నగూడెం కృష్ణం పాలెం ధూమంతున గూడెం రామన్నపాలెం దేవరపల్లి మీదుగా డైమండ్ జంక్షన్ వద్దకు భారీ ర్యాలీతో చేరుకున్నారు. ద్వారకా తిరుమల నుండి దేవరపల్లి డైమండ్ జంక్షన్ వరకు వేలాది వాహనాలు మోటార్ సైకిల్‌తో తెలుగుదేశం పార్టీ జనసేన బిజెపి జెండాలు చేపట్టి గట్టిగా నినాదాలు చేస్తూ తెలుగుదేశం పార్టీ గోపాలపురం నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు జనసేన పార్టీ నేతలు కార్యకర్తలు బిజెపి నేతలు కార్యకర్తలు నినాదాలు చేసుకుంటూ దేవరపల్లి వద్ద డైమండ్ జంక్షన్ చేరుకున్నారు. ద్వారకాతిరుమల నల్లజర్ల దేవరపల్లి మండలాలకు చెందిన తెలుగుదేశం బిజెపి జనసేన నేతల కార్యకర్తలు అధిక సంఖ్యలో డైమండ్ జంక్షన్ వద్ద నుండి భారీ ర్యాలీతో గోపాలపురం తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. నాలుగు మండలాలకు చెందిన టిడిపి,జనసేన, బిజెపినేతలు, కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోపాలపురం నియోజకవర్గానికి ఒక నామినేషన్

విశాలాంధ్ర - గోపాలపురం : గోపాలపురం (ఎస్ సీ) అసెంబ్లీ నియోజక వర్గానికి తొలి రోజున ఒక అభ్యర్థి రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేసినట్టు గోపాలపురం ఎస్సీ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి/ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె ఎల్. శివ జ్యోతి గురువారం తెలియ చేశారు.టీడీపీ తరపున మద్దిపాటి వెంకట రాజు, సన్ ఆఫ్ యోహాను రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్టు తెలియ చేశారు. ఏప్రియల్ 25 వ తేదీ వరకు ప్రతి రోజు (ఏప్రియల్ 21 ఆదివారం మినహా) ఉదయం 11 గంటల నుంచి మ.3 వరకూ మాత్రమే నామినేషన్లు గోపాలపురం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో స్వీకరించనున్నట్టు తెలిపారు. నామినేషన్ అనంతరం వెంకటరాజు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెదేపా విజయ దంకా మోగిస్తుందని తెలిపారు.

కూటమితోనే ప్రజల భవిష్యత్తుకు భరోసా

విశాలాంధ్ర-ఏలూరు: నవ్యాంధ్ర పునర్నిర్మాణం, రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు పునాది రెండూ కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి, జనసేన, బీజేపి కూటమి ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి విశ్వాసం వ్యక్తం చేశారు. వివిధ కార్యక్రమాలు, సభలు, సమావేశాలతో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో బడేటి చంటి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపుతూ, ప్రజలలో చైతన్యం కల్పిస్తూ ఏలూరు సత్రంపాడు 22వ డివిజన్‌లో నిర్వహించిన సంకల్పయాత్రలో బడేటి చంటి పాల్గొన్నారు. స్థానిక సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకందించి, ఆయా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. వారికి భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్పయాత్రలో భాగంగా ప్రజలను కలుస్తున్న సందర్భంలో వారు చెప్పుకుంటున్న సమస్యలు వింటే రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అనే సందేహం కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నగర అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, జనసేన నగర అధ్యక్షులు నాగిరెడ్డి కాశీ నరేష్,టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఆర్.ఎస్.ఆర్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర- మొగల్తూరు : టిడిపి జనసేన బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మొగల్తూరు మండలం కొత్తపాలెం గ్రామంలో గురువారం జనసేన నేత, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి మాజీ ఎమ్మెల్యే బందారు మాధవ నాయుడులు కూటమి ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొత్తపల్లి, మాజీ ఎమ్మెల్యే బందారులు గ్రామంలోని ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి ప్రధాని నరేంద్ర మోడీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రయోజనాల కోసం కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళ్తున్నారని రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు. నర్సాపురం పార్లమెంట్ అభ్యర్థిగా భూపతి రాజు శ్రీనివాస్ వర్మకు కమలం గుర్తుపై ఓటు వేయాలని అసెంబ్లీ అభ్యర్థి నాయకర్ కు గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంపీటీసీ విల్లూరి వెంకటేశ్వరరావు, నిప్పులేటి తారకరామారావు, లోకం జనార్ధనరావు,కొత్తపల్లి ఆంజనేయులు,మైలబత్తుల రాంబాబు, పట్టా రజని, దుసనపూడి సత్యనారాయణ,లక్కు బాబీ,టిడిపి ,జనసేన ,బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

విశాలాంధ్ర-కామవరపుకోట : చింతలపూడి నియోజకవర్గం కామవరపుకోట మండలం ఈస్ట్ యడవల్లి పంచాయతీలో నల్ల గోపు వారి గూడెం గ్రామంలో గురువారం జనసేన నేత కరాటం రాంబాబు, మేక ఈశ్వరయ్య ఆధ్వర్యంలో 500 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మేక ఐశ్వర్య మాట్లాడుతూ కూటమి విజయాన్ని ఏ శక్తి ఆపలేదని కూటమి అభ్యర్థి సంఘ రోషన్ కుమార్ అత్యంత మెజారిటీతో అసెంబ్లీకి పంపడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తోటకూర వెంకట్రావు, సూరవరపు నాగరాజు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు షేక్ వల్లి, తోటకూర మాణిక్యాలరావు, కోట భాస్కర్, సూరవరపు గంగరాజు, టిడిపి నాయకులు గంట మురళి పాల్గొన్నారు.

నాసా స్పేస్ కాంటెస్ట్‌లో సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు

విశాలాంధ్ర-ఏలూరు: అంతర్జాతీయ స్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రథమ విజేతగా నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.శివకుమారి తెలి పారు. ప్రఖ్యాత విశ్వ వైజ్ఞానిక సంస్థ నాసా నిర్వహించిన స్పేస్ కాంటెస్ట్ లో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టుగా నిలిచి, ప్రథమ స్థానం కైవసం చేసుకుందని, విద్యతోపాటు సర్వతోముఖాభివృద్ధి సాధించడంలో శ్రీచైతన్య విద్యార్థులు ఎల్లప్పుడూ ముందున్నారన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక అభినందన సభలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఏ. జి.ఎం ఎస్ పార్థసారధి , రీజినల్ ఇంచార్జ్ సి.హెచ్ ఉదయభాస్కర్, అకడమిక్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు విద్యార్థులను, తల్లిదండ్రులను, ఇన్‌చార్జిలను, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

సామాన్యులకు చేరువుగా పరిశోధనలు జరగాలి

విశాలాంధ్ర -భీమవరం: అధునాతన టెక్నాలజీని సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడానికి విద్యార్థులు మరింత లోతుగా పరిశోధనలు జరిపితే మంచి ఫలితాలు వస్తాయని ఎస్ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు అన్నారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు నూతన టెక్నాలజీని ఉపయోగించి పలు ప్రాజెక్టులు రూపొందించారు. ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న ప్రాజెక్టు ఎక్స్పోను డాక్టర్ ఎం. జగపతిరాజు ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో విస్తృతంగా విస్తరిస్తున్న బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి నిర్ధారణకు తక్కువ సమయంలోనే ఎమ్మారై స్కాన్ విశ్లేషణతో వ్యాధి నిర్ధారణ వేగంగా చేయవచ్చని కళాశాల సిఎస్సి మూడవ సంవత్సరం విద్యార్థినిలు నాగ ప్రసన్న, రోజా, తేజస్వి, తేజ లు అసిస్టెంట్ ప్రొఫెసర్ కె డేవిడ్ రాజు పరివేక్షణలో డీప్ లెర్నింగ్ టెక్నాలజీతో రూపొందించిన ప్రాజెక్టు భావి పరిశోధనలకు ఎంతగానో దోహదపడే విధంగా ఉంది. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ వి చంద్రశేఖర్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులలో ఇన్నోవేషన్స్ ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఐదు రోజులు పాటు ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు మంచి ఆలోచనలతో ప్రాజెక్టులు తీసుకురావడం బావి పరిశోధనలకు ఎంతగానో ద్వాదపడుతుందన్నారు. సిఎస్సి అధ్యాపక బృందం డాక్టర్ కె.శ్రీహరి వర్మ, డాక్టర్ వి. వి.శివరామరాజులు ప్రాజెక్ట్ ఎక్స్‌పో కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు.

మార్పు రావాలంటే ప్రభుత్వం మారాలి

విశాలాంధ్ర -భీమవరం: నోటితో చెప్పే మాటలు కన్నా చేతితో చేసే సేవలు ఎంతో గొప్పవని, పదేళ్లపాటు భీమవరం నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశానని మాజీ ఎమ్మెల్యే, భీమవరం ఉమ్మడి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు అన్నారు. గునుపూడిలోని రాజ్ ట్రస్ట్ కార్యాలయంలో రాజ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గంటా రాజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్పు రావాలంటే నాయకత్వం మారాలని, ప్రస్తుత నాయకత్వంతో రాష్ట్రం వెనుకబడి పోయిందని, ఇటువంటి రాక్షస పాలనకు స్వస్తి చెబుదామన్నారు. ఈ ప్రభుత్వంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, అటువంటి ప్రభుత్వం మనకువద్దని, రానున్నది రామరాజ్యమని, మాన కూటమి ప్రభుత్వం రాగానే రూ 4 వేలకు పింఛన్లు పెంచుతున్నామని, వికలాంగులకు రూ 6 వేలు పింఛన్లు మీ ఇంటికే తీసుకుని రావడం జరుగుతుందని, ఉచిత బస్సు సౌకర్యం కూడా రాబోతుందని అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు మెంటే గోపి మాట్లాడుతూ ప్రజలు గెలించారంటే అప్పుడు అంజిబాబు గెలిచినట్లేనని, గ్లాస్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే అంజిబాబు కుమారుడు పులపర్తి ప్రశాంత్ మాట్లాడుతూ ఆలోచించి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు గంటా రాజ్ కుమార్ మాట్లాడుతూ కూటమి విజయానికి కృషి చేద్దామని అన్నారు. కార్యక్రమంలో యేలేటి న్యూటన్, విజ్జురోతి రాఘవులు, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

విశాలాంధ్ర-కాళ్ళ: నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో ఉండి అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి కలవపూడి శివ ఏలూరు పాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ ఉండి నియో జకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగేందుకు మీ బిడ్డగా ఆశీర్వదించాలని కోరారు. ప్రచారంలో ప్రజలు తనపై చూపుతున్న ఆదరాభిమానులు, ప్రేమను ఎన్నటికీ మరువలేన న్నారు. గ్రామంలో మంచినీరు,సాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయని తెలిపారు. వెంకయ్యవయ్యేరు పంట కాలువ నుంచి ఏలూరుపాడులోని రక్షిత మంచినీటి పథకానికి నీరు సరఫరా అవుతోందని..ఇప్పుడు అది పూర్తిగా కలుషితమైందన్నారు. మంచినీటి చెరువుకు నీరందించే పంట కాలవలు సైతం పూడికలు తీయలేదని వీటి కారణంగా మంచినీరు సాగునీటికి తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. దీనికి శాశ్వతంగా పరిష్కారం చూపిస్తామ న్నారు. ఈకార్యక్రమంలో మహిళలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిక

విశాలాంధ్ర - గణపవరం: మాజీ మంత్రి వట్టి వసంత్ కుమార్ అన్నయ్య కుమారుడు వట్టి పవన్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం గణపవరం మండలం వైయస్సార్ పార్టీ ముఖ్య నాయకులు జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరి ఆయన చేతులు మీదగా జనసేన పార్టీ కండువా కప్పారు. ఈ కార్యక్రమంలో గణపవరం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కూసంపూడి జగపతి రాజు గణపవరం మండలం వల్లూరు గ్రామం నుండి మాజీ సొసైటీ అధ్యక్షులు గణపవరం మండలం కాపు అధ్యక్షులు గంటా అన్నవరం సరిపల్లె గ్రామం చెందిన బుద్ధవరపు పుల్లయ్య బీసీ సెల్ అధ్యక్షులు గణపవరం మండలం వీరేశ్వర పురం గ్రామం మాజీ సర్పంచ్ బాధరాల సూర్యచంద్ర చేరారు. వట్టి పవన్ కుమార్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు.

నిస్సహాయులకు చేయూత నివ్వడం మనందరి కర్తవ్యం

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: పుట్టుకతో, ప్రమాదం వలన నిస్సహాయులుగా వున్న దివ్యాంగులను, వృద్ధులను, ఇబ్బందులలో వున్న బాలలను ఆదుకోవ డమే సమాజ కర్తవ్యం అని లయన్స్ క్లబ్ కృష్ణా జిల్లాకు నూతన గవర్నర్ గా ఎన్నికైన గద్దే శేషగిరి రావు అన్నారు. లయన్స్ క్లబ్ - 316డి-విజయవాడ వారి ఆర్థిక సహాయంతో మండలంలోని తోటపల్లి లో గల హీల్ కృత్రిమ కేంద్రం సహకారముతో కృష్ణా జిల్లా నందిగామ కు చెందిన పారా నరసింహారావు, విజయవాడ - ప్రసాదంపాడు కు చెందిన కొలసాని వీరబాబు లకు కృత్రిమ కాళ్ళు అందజేశారు. లయన్స్ క్లబ్ కృత్రిమ అవయవ విభాగం కోఆర్డినేటర్ జ్యోసుల శ్రీరామ్ పవన్ మాట్లాడుతూ కృత్రిమ కాళ్ళు అందచేయడం ద్వారా దివ్యాంగులలో ఆత్మ స్థైర్యం కలిగించడానికి దాతలు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భముగా జరిగిన కార్యక్రమంలో సూరపనేని కన్స్ట్రక్షన్స్ అధినేత లయన్ సూరపనేని జనార్దనరావు, లయన్స్ క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ లయన్ శివ శంకర్, లయన్ జలచంద్ర రావు, హీల్ కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

నీతికి, అవినీతికి మధ్య పోటీ

విశాలాంధ్ర - నరసాపురం: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో నీతివంతమైన పరిపాలనలో ప్రజా సంక్షేమం కోసం పాటు పడే టిడిపి కి, అవినీతి కి నిలువెత్తు నిదర్శనమైన వైసిపికి యుద్ధమని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు అన్నారు. గురువారం నరసాపురం నియోజకవర్గ ఈశాన్య ప్రాంతమైన గొంది గ్రామం నుండి ఆయన కూటమి అసెంబ్లీ అభ్యర్థి బొమ్మిడి నాయకర్, పార్లమెంట్ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ విజయానికి మద్దతుగా ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అనంతరం మొగల్తూరు మండలం కొత్తపాలెం గ్రామంలో, నరసాపురం మండలం పసలదివి గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బా రాయుడుతో కలిసి ఎన్నికల ప్రచారం చేసి గ్లాసు గుర్తుకు వేసి బొమ్మిడి నాయకర్, కమలం గుర్తుకు వేసి పార్లమెంట్ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ ను అఖండ మైన మెజారిటీ తో గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఉత్తమ ర్యాంక్ సాధించిన ఖంగనా లీలాభాయ్

విశాలాంధ్ర - పెంటపాడు: పెంటపాడు మండలం మీనవల్లూరు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో 4 వ తరగతి పూర్తి చేసుకుని 5వ తరగతిలో ప్రవేశించుటకు గాను మార్చి నెల పదవ తేదీన జరిగిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల రాష్ట్రస్థాయి ఎంట్రన్స్ పరీక్షలో,జోనల్ స్థాయిలో 17వ ర్యాంకు సాధించిన సందర్భంగా పెంటపాడు మండలం ఎంఈఓ-1 ఎం.శ్రీనివాస్ విద్యార్థిని ఖంగనా లీలాబాయ్ కు గురువారం పాఠశాలలో అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ-1 శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మెరుగైన ఫలితాలను సాధించవచ్చునని తెలిపారు. భవిష్యత్తులో స్థిరపడిన వారంతా ఇష్టపడి చదివిన వారే అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఈ.వెంకటేశ్వర్లు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.మండలం లోని కోరుమిల్లి ఎంపీపీ పాఠశాల, పదోన్నతిపై వెళ్లిన బసవరాజు మాస్టారుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డీవీ. ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారులు ఎం.శ్రీనివాస్, టీవీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఫణి కుమార్ లు హాజరై బసవరాజు మాస్టారుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎం.సామ్యూల్‌రాజు, పాప లింగేశ్వరరావు, సిహెచ్.వి.కోటేష్, సోము వెంకటరత్నం, సిఆర్ పి.వాసు, డేటా ఎంట్రీ ఆపరేటర్ బాలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూటమిదే విజయం

విశాలాంధ్ర-వీరవాసరం: రాబోయే ఎన్నికల్లో తెదేపా, జనసేన, భాజపా కూటమి విజయం ఖాయమని భీమవరం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు అన్నారు. మండలం లోని నేలపోగుల గ్రామంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామదేవతకు నమస్కరించి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు త్వరలోనే మంచి రోజులు వస్తాయని, వైకాపాను ప్రజలు తరిమికొట్టే రోజులు సమీపించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి, కూటమి మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్‌డిఏ అభ్యర్థిగా పోటీ చేసే అదృష్టం వరించేది రెడ్డికా? రాజుకా?

విశాలాంధ్ర - అనపర్తి : సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి, టిడిపి అభ్యర్థులు మధ్య అనపర్తిలో తీవ్ర పోటీ ఉంటుందని వేసిన అంచనాలు ప్రస్తుతం తలకిందులయ్యాయి. 2014, 2019 ఎన్నికల్లో డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మధ్య జరిగిన ఎన్నికల పోరులో 2014లో రామకృష్ణారెడ్డి స్వల్ప మెజార్టీతో గెలవగా 2019లో డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి భారీ మెజార్టీతో గెలిచి విజయం సాధించారు. ఈ సారి కూడా వీరిద్దరి మధ్య నువ్వా నేనా అనే రీతిలో పోటీ జరుగుతుందని అందరూ ఊహించగా టిడిపి నేత నారా చంద్రబాబు ముందుగా జనసేనతో పొత్తు పెట్టుకోవడం అనపర్తి సీటు టిడిపి ,జనసేన ఉమ్మడి అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరు ప్రకటించి ఉండటం తదనంతర పరిణామాల నేపథ్యంలో బిజెపికి సీటు కేటాయించడం అభ్యర్థిగా మాజీ సైనికుడు ఎం ఎస్ ఆర్ కె రాజు పేరు ప్రకటించడం ఒక్కసారిగా అందరినీ ఆశ్చర్య పరిచింది. దీంతో ఖంగు తిన్న రామకృష్ణారెడ్డి వెంటనే రంగంలోకి దిగి తనకే సీటు కేటాయించాలని లేకపోతే ఇండిపెండెంట్ గా అయినా సరే పోటీ చేస్తానని హెచ్చరించడంతో మళ్ళీ రామకృష్ణారెడ్డి కే అనపర్తి సీటు కేటాయించనున్నారని రెండు రోజుల్లో అధికార ప్రకటన వెలువడుతుందని టిడిపి నేతలు హంగామా చేసినప్పటికీ దాదాపు 15 రోజులు కావస్తున్నా ఇప్పటికీ ఏమి అధికారికంగా ప్రకటించకపోవడంతో నియోజకవర్గ టీడీపీ, బిజెపి నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఇక మరో భాగస్వామి జనసేన (నేతల)కు ఎవరికి మద్దతు ఇవ్వాలో తెలియక దిక్కు తోచని పరిస్థితి ఏర్పడింది. తగ్గేదేలే అంటూ టిడిపి తరపున ఎన్ డి ఏ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోటీకి రె"ఢీ"అంటుండగా బిజెపి తరపున ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించిన ఎం ఎస్ ఆర్ కే రాజు నేనూ రె"ఢీ"అంటూ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరుగుతుంది.ఈ కీలక పరిణామాలతో అనపర్తి నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిగా చివరికి ఎవరు కొనసాగుతారో అనే తీవ్ర ఉత్కంఠ భరితంగా అభ్యర్థి ఎపిసోడ్ కొనసాగుతుంది.1983 నుండి ఇప్పటివరకు నియోజకవర్గంలో అభ్యర్థుల పోటీ విషయంలో ఇటువంటి పరిస్థితి తలెత్తలేదు, చూడలేదంటూ రాజకీయ అనుభవజ్ఞులు చెబుతున్నారు. బిజెపి అభ్యర్థి శివరామకృష్ణం రాజే ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థిగా కొనసాగుతారా? లేదా ముచ్చటగా మూడోసారి అభ్యర్థి పేరు మారి టిడిపి నేత, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికే మళ్ళీ సీటు కేటాయిస్తారా అంటూ ప్రజల్లో తీవ్ర స్థాయిలో చర్చ, ఉత్కంఠ కొనసాగుతోంది.

ఫార్మసీ కళాశాలలో ఏఐపై సదస్సు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం ఆదిత్య ఫార్మసీ కళాశాలలో అండర్‌స్టాండింగ్ ద అప్రోచ్ టు పబ్లికేషన్స్: స్పెషల్ ఎంఫసిస్ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ (ఏఐ) అనే అంశంపై తమిళనాడులోని జేఎస్ఎస్ ఫార్మసీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కర్రి వివిఎస్ నారాయణరెడ్డి సెమినార్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సతీష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సత్య నారాయణ ప్రచురణల మెరుగుదలకు వివిధ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ (ఏఐ) సాధనాల వినియోగాన్ని ప్రదర్శించారు. సదస్సు అనంతరం ముఖ్య అతిథి డాక్టర్ నారాయణ రెడ్డిని ఆదిత్య యాజమాన్యం తరపున దుశ్శాలువా జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరించారు.

అంగన్వాడీ కేందాల్లో బేబీ బచావో భేటీ పడావో

విశాలాంధ్ర-పెరవలి : మండలంలోని అంగన్వాడీ కేంద్రాలవద్ద గురువారం బేటీ బచావో భేటీ పడావో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో పలువురు మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించుకోవడం ఆడపిల్లలను చదివించుకోవడం వంటి విషయాలపై వివరించారు. .ఈకార్యక్రమాలలో సూపర్ వైజర్ బాల సరస్వతి, ఉపాధ్యాయులు అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

బండారు లంకలో ఆనందరావు ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షులు మల్లుల పోలయ్య ఆధ్వర్యంలో చింత శంకరమూర్తి, పిచ్చుక శ్యామ్ అధ్యక్షతన అమలాపురం నియోజకవర్గం తెలుగు దేశం, జనసేన, బిజెపి పార్టీ ఉమ్మడి అభ్యర్థి అయితా బత్తుల ఆనందరావు, ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి అని ఓటర్లను అభ్యర్థించారు. చంద్రబాబుని ముఖ్య మంత్రి చేయాలి అని, చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. రెండు ఓట్లు సైకిల్ గుర్తు పై ఓటు వేసి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి అని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్లమెంటు స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా మెర్ల

విశాలాంధ్ర - కరప : కాకినాడ పార్లమెంట్ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా వేలంగి గ్రామానికి చెందిన మెర్ల భవాని శంకర్ ప్రసాద్ గురువారం కాకినాడలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మెర్ల శంకర్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలు అక్రమాలు చూసి వాటిని న్యాయపరంగా అడ్డుకునేందుకు తాను కాకినాడ పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పార్లమెంటులో చర్చించేందుకు చిత్త శుద్ధితో కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఓటర్లు తమ అభ్యర్థనను మన్నించి మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఘనంగా పార్థసారథి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర- నూజివీడు : నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కొలుసు పార్థసారథి జన్మదిన వేడుకలను గురువారం తెలుగు దేశం శ్రేణులు అట్టహాసంగా నిర్వహించాయి. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు యువత ఆధ్వర్యంలో భారీ కేక్ ఏర్పాటు చేసి పార్థసారథి జన్మదిన వేడుకలు నిర్వహించడానికి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, తెలుగుదేశం నాయకులు కాపా శ్రీనివాసరావు, నూతక్కి వేణుగోపాలరావులతోపాటు పార్టీ అనుబంధ సంఘాలకు చెందిన పలువురు నాయకులు సారధికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సారధి జన్మదినం సందర్భంగా నూజివీడులోని షిరిడి సాయి ఆలయంలో, జేబీఎల్ వృద్ధుల ఆశ్రమంలో నితిన్ కృష్ణ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు.



కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి

విశాలాంధ్ర - రాజానగరం : రాజనగరం నియోజవర్గంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుకు తామంతా కృషి చేస్తున్నామని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు అన్నారు. నియోజకవర్గంలోని కోరుకొండ గ్రామంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రాజమండ్రి ఎంపీ కూటమి అభ్యర్థి దగ్గుపాటి పురంధేశ్వరి గురువారం దర్శించుకున్నారు.దీనిలో భాగంగా తిరిగి బూరుగుపూడి టీడీపీ కార్యాలయాన్ని సందర్శించారు. రాజానగరం మండల తెలుగు తమ్ముళ్లు పురంధేశ్వరిని కలిసి తమ సంఘీభావం తెలిపారు. దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.అనంతరం జరిగిన నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థులు ఆత్మీయ సమావేశంలో అసెంబ్లీ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, నియోజవర్గ టిడిపి ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి,మాజీ ఎమ్మెల్యే చిట్టూరి రవీంద్ర సంయుక్త అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ కూటమి అభ్యర్థులు పాల్గొని తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు, టీడీపీ బీసీ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు వంక మల్లిఖార్జున స్వామి,టీడీపీ యాదవ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు బత్తుల నాగేశ్వరావు (నాగు),నూనె వెంకన్న,ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ ఖండవిల్లి లక్ష్మీ,టీడీపీ అధికార ప్రతినిధి నూనె వెంకన్న,నాయకులు బుద్దిగా అప్పారావు,పెద్దిశెట్టి నారాయణ స్వామి కొణతం నరసింహారావు,దేవన నరసయ్య,సోడసాని త్రిమూర్తులు, పలివేల లక్ష్మణ్, తదితరులు భారీగా పాల్గొన్నారు.

నిజాయితీగల నాయకుడు పవన్ కల్యాణ్

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం నియోజవర్గం గోకులం గ్రాండ్ హోటల్‌లో జనసేన పార్టీ పత్రిక సమావేశం నిర్వహించింది. ప్రముఖ సినీ నటుడు బలిరెడ్డి పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఈ రోజు ప్రపంచం మొత్తం తెలిసేలా పిఠాపురం పేరు మారుమ్రోగిపోతుం దన్నారు. పిఠాపురం నుంచి పవనాపురం అయ్యిందన్నారు. వైసీపీ పాలన ఎలా ఉందో వారు ఎలా మాట్లాడుతున్నారో, మేము అలా మాట్లాడలేమని నోటికి ఏది వస్తే అది మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. నిజాలు ఉంటే మాట్లాడాలని ఒక నిజాయితీగల నాయకుడు పవన్ కళ్యాణ్ అని, జగన్ మోహన్ స్ట్రీట్ నాయకుడు అయితే పవన్ కళ్యాణ్ స్టేట్ నాయకుడన్నారు. గల్లీ పాలిటిక్స్ చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కదారి తమయ్య నాయుడు, వెన్నపు చక్రధర్ రావు, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, సూరవరపు సురేష్, తోలేటి శిరీష, జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో సినీ నటుడు పృథ్వీరాజ్

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : జనసేన ఎన్నికల ప్రచారంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ వర్మతో గురువారం కొనపపేట గ్రామంలో సినీ హాస్య నటుడు పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఇంటింటా ప్రచారంలో భాగంగా మత్స్యకారులతో ముఖాముఖి మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి అధికారం లోకి రాగానే మత్స్యకార సమస్యలను పవన్ కళ్యాణ్ తీరుస్తారని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే జనసేన జెండా ఎగర వెయ్యాలని తెలిపారు. డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, మత్స్యకార నాయకులు పల్లేటి బాపన దొర, కంబాల దాసు, టిడిపి మండల అధ్యక్షులు అనిశెట్టి సత్యానంద రెడ్డి, రాచపల్లి సనపయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవి తరగతుల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - పిఠాపురం : ఉచిత వేసవి శిక్షణా తరగతులకు సంబంధించిన గోడ పత్రికను సహృదయ మిత్రమండలి సభ్యులు స్థానిక సూర్యరాయ గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మిత్రమండలి సభ్యులు మాట్లాడుతూ గత 24 సంవత్సరాలుగా తమ సంస్థ దిగ్విజయంగా ఈ తరగతులను ప్రతి వేసవిలోనూ నిర్వహిస్తున్నదని తెలియజేశారు. మే 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు పిఠాపురంలోని సూర్యరాయ గ్రంథాలయంలో ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు తరగతులు జరుగుతాయని తెలియజేశారు. ఈ వేసవి శిక్షణా తరగుతలలో స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్, వ్యక్తిత్వ వికాసం, సృజనాత్మక కళలు మొదలగు అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. వివరాలకు 79899 28289, 7794828167 ఫోన్ నెంబర్లు సంప్రదించవలసిందిగా మిత్రమండలి సభ్యులు కోరారు.

30న సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - కరప : కరప మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10:30కు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన ఏర్పాటు చేయగా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల వివిధ శాఖల అధికారులు, తమ వద్ద ఉన్న పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరుకావాలని ఎండిఓ అప్పారావు తెలిపారు.

అనపర్తి నియోజకవర్గంలో నామినేషన్లు నిల్

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి అసెంబ్లీ నియోజక వర్గానికి తొలి రోజున నామినేషన్లు దాఖలు చేయలేదని నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి/ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. మాధురీ గురువారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. ఏప్రియల్ 25 వ తేదీ వరకు ప్రతి రోజు (ఏప్రియల్ 21 ఆదివారం మినహా) ఉదయం 11 గంటల నుంచి మ.3 వరకూ మాత్రమే నామినేషన్లు అనపర్తి మండల అభివృద్ధి ఆధికారి కార్యాలయం లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో స్వీకరించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

24న పరమట శ్యామ్ నామినేషన్

విశాలాంధ్ర - అమలాపురం : తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థిగా పరమట శ్యామ్ 24వతేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. బుధవారం 10.42 నిమిషాలకు ఆయన రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేస్తారు. అభిమానులు అందరూ తరలి వచ్చి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్యామ్ కోరారు. 29 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి సేవ చేసానని తనను కనీసం గుర్తించలేదన్నారు. నా జీవితంలో సగ భాగం పార్టీ కోసం కష్ట పడితే కనీసం పార్టీ పదవి కూడా రాకుండా అడ్డుపడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను శక్తిలేని వాడినని అభ్యర్థి కోటరీ ప్రచారం చేస్తుందని, తన శక్తి ఏమిటో వచ్చే ఎన్నికల్లో చూపుతానని శ్యామ్ అన్నారు. పార్టీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేయడం బాధాకరమైనప్పటికీ తప్పని పరిస్థితిలో ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిపించాలని శ్యామ్ కోరారు.

నేడు ఎమ్మెల్యే అభ్యర్థులుగా పితాని, శ్రీరంగనాధరాజు నామినేషన్లు

విశాలాంధ్ర -పోడూరు : ఆచంట అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అసెంబ్లీ అభ్యర్థులైన పితాని సత్యనారాయణ, చెరుకువాడ శ్రీరంగనాధరాజు శుక్రవారం తమ నామినేషన్‌లు దాఖలు చెయ్యనున్నారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థిగా అచంట మాజీ శాసన సభ్యులు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. వైఎస్ఆర్ సీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి, ప్రస్తుత శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. కూటమి అభ్యర్థిగా పితాని సత్యనారాయణ ఉదయం గం.7:30 కు పోడూరు మండలం కొమ్ముచిక్కాల లోని తన నివాసం నుండి నియోజకవర్గ టిడిపి,బిజెపి, జనసేన నాయకులతో కలిపి పి.పోలవరం, మార్టేరు మీదుగా ఆచంటకు ర్యాలీగా వెళ్లి ఉదయం గం.9:30 కు తహసీల్దార్ కార్యాలయం వద్ద నామినేషన్ వేయనున్నారు.